క్లుప్తంగా

పేరెంట్- టీచర్స్ మీట్ ఏర్పాట్లను పరిశీలించిన డీఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ, కొండలరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలతో పాటు కొత్తపేటలోని జలగం రామారావు ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన పేరెంట్- టీచర్ల మీట్ ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం సందర్శించారు. తరగతిగదుల్లో సమావేశాల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, విద్యార్థులకు అందించేందుకు సిద్ధం చేసిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆదివారం జరగనున్న ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. ఆమె వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రమీలారాణి, సుధారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.

శ్యామలానగర్‌లో పూర్తయిన తేజా ఫార్ర్చ్యూన్



నగరంపాలెం: ఇటీవల గుంటూరు శ్యామలానగర్‌లో విల్లాస్ ప్రాజెక్ట్ చేపట్టిన తేజా ఫార్చ్యూన్ హోమ్స్ నిర్మాణం పూర్తి అయింది. ఈ సందర్భంగా తేజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ మేనేజింగ్ పార్టనర్ యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో ఇటువంటి మెగా ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడం ఆనందంగా ఉందని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్, సిమెంట్ రోడ్లు, క్లబ్ హౌస్ వంటి అధునాతనమైన మౌలిక సౌకర్యాలతో ఖాతాదారులకు అప్పగించడం జరిగిందని చెప్పారు. 26 ఏళ్లకే ఇటువంటి ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్ నిర్మించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఇటువంటి గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్‌లను తమ సంస్థ ద్వారా మరెన్నో నిర్మించి ప్రజలకు అందిస్తామని చెప్పారు. మంచి సౌకర్యాలతో నాణ్యమైన గృహాలను అందించడం సంతోషంగా ఉందని కస్టమర్లు సంస్థను అభినందించారు.

మహానటి సావిత్రికి నివాళి



నగరంపాలెం: కళా దర్బార్- అమరావతి అధ్వర్యంలో మహానటి సావిత్రి జయంతి సందర్భంగా శుక్రవారం నాజ్ కూడలిలోని ఆమె కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళా దర్బార్ – అమరావతి వ్యవస్థాపక అధ్యక్షులు పొత్తూరి రంగారావు అధ్యక్షత వహించగా, సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు చందవోలు శోభారాణి విచ్చేసి నివాళులర్పించారు. గాయనీ, గాయకులు మిరియాల ప్రసాదరావు, కె.బాబూరావు, టి.సుధీర్ బాబు, అరికపూడి సాంబశివరావు, సౌజన్య బృందం సావిత్రి నటించిన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. కళాదర్బార్ సంస్థ సభ్యులు రాజశేఖర్, ధర్మ సింగ్, మహిళా సభ్యులు విజయలక్ష్మి, రాధ, నాగేశ్వరి పాల్గొన్నారు.

జనగణనతో పాటే కులగణన చేపట్టాలని వినతి



నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనతో పాటే సమగ్ర కులగణన కూడా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబీసీల సమగ్ర అభివృద్ధి కులగణనతోనే ముడిపడి ఉందన్నారు. భవిష్యత్తులో ఓబీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో, చట్ట సభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఎ.నాగమల్లేశ్వరావు పాల్గొన్నారు.

అలరించిన నారాయణ తీర్థుల తరంగాలు



నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శుక్రవారం నాగార్జున సాంస్కృతిక కేంద్రం, నాగార్జున సంగీత కళాశాల సంయుక్తంగా శ్రీనారాయణ తీర్థుల తరంగాలు అనే గాత్ర కచేరి నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ ఎస్.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సంపత్‌కుమార్ ఆలపించగా తరంగాలు శ్రోతలను అలరించాయి. ముఖ్య అతిథిగా డీఆర్ఎం సి.రామకృష్ణ, శంకర కంటి ఆస్పత్రి చీఫ్ మెడికల్ అధికారి పి.సుధాకర్ హాజరై మాట్లాడారు. నాగార్జున కల్చరల్ సెంటర్ కార్యదర్శి పీఎస్ఎన్ మూర్తి, నాగార్జున స్కూల్ ఆఫ్ మ్యూజిక్ కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీధర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పెద్దసార్లు.. నాడిపడితే ఒట్టు

- అందుబాటులో ఉండని జీజీహెచ్ వైద్యులు
- పీజీ వైద్యులతోనే ఓపీ వైద్యసేవలు
- వ్యాధి నిర్ధారణలో జాప్యంతో రోగులకు తిప్పలు
- పనివేళల్లో సొంత ఆస్పత్రుల్లో సేవలు
- తనిఖీలు మరచిన ఆస్పత్రి అధికారులు



ఓపీలో పేర్లు నమోదు చేయించుకుంటున్న రోగులు

గుంటూరు మెడికల్: ఏపీలో పేదల పెద్దాస్పత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం ఓపీ వైద్య విభాగానికి వచ్చే పేద రోగులకు అరకొరే వైద్యసేవలు అందుతున్నాయి. ఓపీ వైద్య విభాగాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాల్సి ఉంది. కాని ఎక్కువ శాతం మంది వైద్యులు ఓపీలో జీజీహెచ్‌లో ఉండాల్సిన సమయంలో తమ సొంత ఆస్పత్రుల్లో ప్రాక్టీస్ చేసుకుంటూ ముఖంచాటేస్తున్నారు.

ఓపీలో ప్రొఫెసర్లు ఊసే ఉండటం లేదు....

నిబంధనల ప్రకారం జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగంలో రోగులకు చికిత్స అందించేందుకు తప్పనిసరిగా ప్రొఫెసర్ స్థాయిలో ఉండే వైద్యులు ఉండి చికిత్స అందించాలి. ప్రొఫెసర్‌తో పాటుగా అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓపీలో ఉండి రోగులకు చికిత్స అందించాలి. వీరి పర్యవేక్షణలో పీజీ వైద్యులు ఉండి రోగులకు చికిత్స చేయాల్సి ఉంది. కాని పెద్దాస్పత్రిలో పనిచేస్తున్న ఎక్కువ మంది వైద్యులకు సొంత క్లీనిక్‌లు, ఆస్పత్రులు ఉన్నాయి. క్లీనిక్‌లు లేనివారు ప్రైవేటు ఆస్పత్రులతో ఒప్పందం చేసుకుని వైద్యసేవలు అందిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

జీజీహెచ్‌లో పెద్దసార్లపై పర్యవేక్షణ లేకపోవటంతో వారు మొక్కుబడిగా జీజీహెచ్‌కు వచ్చి వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీలోనే విధుల్లో ఉండాలి. మధ్యాహ్నం గంటసేపు భోజన విరామం అనంతరం తిరిగి ఓపీ సేవలు కొనసాగించాల్సి ఉంది. కాని చాలా మంది సీనియర్ వైద్యులు ఓపీ వైద్య విభాగానికి విధులకు హాజరు కావటం లేదు. కొంత మంది వైద్యులు వచ్చిన సమయపాలన పాటించకుండా మొక్కుబడిగా కొంత సేపు ఉండి వెళ్లిపోతున్నారు. సీనియర్ వైద్యులు లేకపోవటంతో జూనియర్ వైద్యులతోనే ఎక్కువ శాతం ఓపీ వైద్య విభాగాలు పనిచేస్తున్నాయి. జూనియర్ వైద్యులు వ్యాధి నిర్ధారణ కోసం పలు రకాల వైద్య పరీక్షలు రాసి రోగిని పంపించి వేస్తున్నారు.



ఖాళీగా ఉన్న సీనియర్ వైద్యుల సీట్లు

పర్యవేక్షణ నిల్

ఓపీ విభాగంలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తున్నారా.. లేదా అనే విషయాన్ని పర్యవేక్షించాల్సిన ఆసుపత్రి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుండిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రి అధికారుల పర్యవేక్షణ వైద్యులపై లేకపోవడంతో జీజీహెచ్ సీనియర్ వైద్యులు ఎక్కువ శాతం మంది ఆస్పత్రిలో ఉండాల్సిన సమయంలో సొంత క్లీనిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉంటున్నారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే వైద్యులు ఓపీలో ఉన్నారా? ఆస్పత్రి బయటకు వెళ్లారా అనే విషయాలు తెలుసుకోవచ్చు. కనీసం సీసీ కెమెరాలు ఉపయోగించి వైద్యులను పర్యవేక్షించాల్సిన అధికారులు ఎందుకు మిన్నకుండిపోతున్నారో అర్థం కావడం లేదు.

అంతా ఓపీలోనే..

కొంత మంది సీనియర్ వైద్యులు ఓపీ విభాగాలకు వచ్చినప్పటికీ రోగులను పరీక్షించకుండా వార్డుల్లో, ఆపరేషన్ థియేటర్‌లలో చేయాల్సిన విధులను ఓపీ విభాగాల్లోనే నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా జూనియర్ వైద్యులకు బెడ్‌సైడ్ టీచింగ్ మధ్యాహ్నం సమయంలో, ఓపీ ముగిసిన తరువాత చేయాల్సి ఉంటుంది. కాని ఒక పక్క రోగులతో ఓపీలు కిటకిటలాడుతున్నా ఓపీ వైద్య సేవల పనిని జూనియర్ వైద్యులకు వదిలేసి టీచింగ్ పనుల్లో బిజీగా ఉంటున్నారు. ఓపీ ముగిసిన తరువాత చేయాల్సిన టీచింగ్‌ను ఓపీ సమయంలోనే చేసి టీచింగ్ చేయాల్సిన సమయంలో సొంత ప్రాక్టీస్‌కు పరుగులు తీస్తున్నారు. దీని ద్వారా జూనియర్ వైద్యులకు నాణ్యమైన బోధన లభించకపోగా, రోగులకు అరకొర వైద్య సేవలు లభిస్తాయి.

జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలి

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ జీజీహెచ్ పనితీరుపై దృష్టి సారిస్తేనే మెరుగైన వైద్యం పేదలకు లభిస్తుందని పలువురు రోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వైద్యుల పనితీరుపై ఆకస్మిక తనిఖీలు చేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చి వైద్యులు పనితీరు మెరుగు పరుచుకునే అవకాశం ఉంది. కలెక్టర్ పేదల వైద్య సేవలపై దృష్టి సారించి జీజీహెచ్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

లక్ష్మీపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీఐటీయూ నగర కార్యదర్శి బి.ముత్యాలరావు అన్నారు. నగరంలో 41వ డివిజన్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్ లోని సీహెచ్ హరిబాబు స్మారక భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి షేక్ ఖాశిం వహీద్ అధ్యక్షత వహించారు. ముత్యాలరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో సుందరయ్య నగర్ అభివృద్ధి కమిటీ నాయకులు షేక్ మస్తాన్ వలి, కె.ఆంజనేయులు, మహిళా సంఘం స్థానిక అధ్యక్షులు ఏ సుకన్య, అచ్యుత కుమారి, కేవీపీఎస్ నాయకులు కిషోర్, ప్రభుదాసు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్, విశ్లేషకులు సదాశివం మాట్లాడుతూ ప్రపంచానికి నూతన దర్శనాన్ని అందించారన్నారు. ఆయన వ్యక్తిత్వంలోని విద్యాజ్ఞానం, పరిశోధన, నైతికత, విమోచన కలిసి నడుస్తాయన్నారు. విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ మను స్మృతి భావజాలానికి ప్రత్యామ్నాయంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని, ఆయన పాండిత్యం, విజ్ఞత, మానవతాదృష్టి, బౌద్ధ నీతి, సమసమాజ భావన భారతరాజ్యాంగంలో సముచితంగా సమన్వయించబడ్డాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ నాయకులు కృష్ణారావు, వెంకటరత్నం, కోటేశ్వరరావు, అధ్యాపకులు సుబ్బారెడ్డి, జనార్ధనరావు, ముప్పాళ్ల ప్రసాదరావులు, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే లింగం శెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. దళితులు, అణగారిన వర్గాలు ఎదగాలంటే రిజర్వేషన్లు కావాలని పట్టుబట్టి రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తు చేశారు. నాటి రిజర్వేషన్‌ల ఫలితంగానే నేడు దళితుల, అణగారిన వర్గాలు చదువుకుని దేశంలో కీలకమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్‌పార్టీ ముందుకు తీసుకువెళ్తుందని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు వెస్ట్ ఇన్‌చార్జి రాచకొండ జాన్ బాబు, పార్టీ నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లా సునీల్, కూచినపూడి విజయ పాల్గొన్నారు.



డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ జయరామ్‌ప్రసాద్

లక్ష్మీపురం: చట్ట వ్యతిరేక చర్యలకు, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ జయరామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌వీఎన్‌కాలనీలో శుక్రవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ జయరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యువత, విద్యార్థులు వారి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. మారకద్రవ్యాల జోలికి వెళ్లకుండా చూసుకోవాలని కోరారు. దూర ప్రాంతాలకు వెళుతున్నప్పుడు సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం తెలియజేయాలన్నారు. ఇటీవల కాలంలో నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రధాన వీధుల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టాభిపురం పోలీసు స్టేషన్ సీఐ వీరేంద్రబాబు పాల్గొన్నారు.

పారా మెడికల్ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి

గుంటూరు మెడికల్: పారా మెడికల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై శుక్రవారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు పారా మెడికల్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రమేష్ బాబు, సెక్రెటరీ నందిగామ నాగరాజు వినతి పత్రం అందజేశారు. సరైన వేతనాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, పారా డికల్ ఉద్యోగుల సర్వీసును పరిగణలోకి తీసుకొని కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఔట్ సోర్సింగ్ పథకాల అమలు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖలో పని చేసే ప్రతి ఒక్కరికి 35 క్యాజువల్ లీవ్స్ వర్తించేలాగా కొత్త జీవో తీసుకురావాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పారామెడికల్ ఉద్యోగులను కాంట్రాక్ట్ విధానంలోనే భర్తీ చేయాలని విన్నవించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు: విద్యుత్ లైనుల మరమ్మతుల్లో భాగంగా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు –4 డీఈఈ పి.హెచ్.ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. పాతగుంటూరు, బావోజీ మఠం, వినోబా నగర్, బాలాజీ నగర్, ఆలీ నగర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు ఉచిత వైద్య సలహా శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఈనెల 8న 'చర్మ వ్యాధుల ఉచిత వైద్య సలహా శిబిరం– బి.పి.,షుగర్ బాధితుల్లో చర్మ సమస్యలు చికిత్సా విధానాలపై శాస్త్రీయ అవగాహన సభ 'నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుండి 12గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్.హెచ్.ఓ . భవనంలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

బదిలీలకు రంగం సిద్ధం...!

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో వర్క్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకంగా మారింది.. వారే కాంట్రాక్టర్లుగా.. మరికొంత మంది బినామీ కాంట్రాక్టర్లుగా పనులు చేస్తూ.. ఏఈలను శాసించే స్థాయిలో ఉండటంపై గురువారం సాక్షి దినపత్రికలో వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఇష్టారాజ్యం అనే కథనం ప్రచురితమైంది. దీనిపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సీరియస్ అయినట్లు సమాచారం . ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో, ఎంత కాలం నుంచి పనిచేస్తున్నారో అని వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలిసింది. నిరంతర నిఘా పెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తుంది.

రతన్ టాటా స్ఫూర్తితో ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: రతన్‌టాటా స్ఫూర్తితో విద్యార్థుల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని వామని ఓవర్సీస్ ప్రైవేటు లిమిటెడ్ హెచ్ఆర్ మేనేజర్ బి.వాసు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం టాటా గ్రూప్ మైలురాళ్లు– రతన్‌టాటా వారసత్వం' అనే అంశంపై రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వాసు మాట్లాడుతూ టాటా గ్రూప్ ప్రపంచ స్థాయికి ఎదగడంలో రతన్‌టాటా కీలకపాత్ర పోషించారని అన్నారు. వ్యాపారాన్ని దేశభక్తితో చేయడంతో పాటు సామాజికాభివృద్ధికి పెద్దపీట వేసిన రతన్‌టాటా వంటి మానవత్వం కలిగిన వ్యాపార దిగ్గజం దేశంలో మరొకరు లేరని అన్నారు. ఈసందర్భంగా క్విజ్ పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.రెండు వేలు, రూ.1,500, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, రాజేశ్వరి పాల్గొన్నారు.



క్విజ్ పోటీల విజేతలతో వాసు, ఎస్వీ రమణ, లలిత తదితరులు

సీతారామయ్యకు అత్యుత్తమ పాఠశాల అవార్డు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలకు అత్యుత్తమ పాఠశాలగా అవార్డు దక్కినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. బెస్ట్ అకడమిక్ ఎక్స్‌లెన్స్, ఎక్స్‌లెన్స్ ఇన్ ఇన్‌స్పిరేషనల్ లీడర్‌షిప్, ఎక్స్‌లెన్స్ ఇన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ కేటగిరీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని టాప్–10 సీబీఎస్ఈ పాఠశాలల్లో ఒకటిగా నిలిచిన సీతారామయ్య హైస్కూల్ ఈటీ టెక్ ట్రైల్‌బ్లేజర్ అవార్డు పొందినట్లు వివరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో రామన్ మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగుచుక్, విశ్రాంత ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితర ప్రముఖుల సమక్షంలో అవార్డు ప్రదానం చేశారని పేర్కొన్నారు. తమ విద్యాసంస్థను భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా, అత్యుత్తమ ప్రమాణాలను పాటించే విధంగా నిరంతరం శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. సమష్టి కృషి ఫలితంగా జాతీయస్థాయిలో అవార్డు వరించిందని, దీనికి కారకులైన పాలకవర్గం, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు ప్రదానోత్సవంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, సీనియర్ కో–ఆర్డినేటర్ దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

10న లలిత కళా ఉత్సవం

వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం



సి. సుజాత



డాక్టర్ ఎం.హరికిషన్



అయ్యల సోమయాజుల అహల

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్‌లో ఈనెల 10న నిర్వహించనున్న లలిత కళా ఉత్సవంలో వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం పురస్కార గ్రహీతల వివరాలను ప్రకటించారు. తెలుగు రచయిత్రి, పాత్రికేయురాలిగా, స్త్రీవాద ఉద్యమంతో సాహిత్య జీవితాన్ని గడుపుతున్న సి.సుజాతకు మాలతీ ప్రమదా సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. తెనాలికి చెందిన సుజాత 1986లో పాత్రికేయవృత్తిలోకి ప్రవేశించారు. రచయిత్రిగా వివిధ నవలు, కథలను రాశారు.

మంగాదేవి బాల సాహిత్య పురస్కారం

బాల సాహిత్యంలో విశేష కృషి చేసిన ఉపాధ్యాయుడు డాక్టర్ ఎం.హరికిషన్‌కు మంగాదేవి బాల సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

ప్రతిభా పల్లవం పురస్కారం

హైదరాబాద్‌కు చెందిన యువ అవాని, వర్ధమాన కవయిత్రి, పైథాన్ ప్రోగ్రామర్, షీరోస్ ఔత్సాహికురాలైన 8వ తరగతి విద్యార్థిని అయ్యల సోమయాజుల అహలను ప్రతిభా పల్లవం పురస్కారంతో సత్కరించనున్నారు.

సాంకేతిక రంగంలో మార్పులకు అనుగుణంగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి పేర్కొన్నారు. శుక్రవారం గుజ్జనగుండ్లలోని కళాశాలలో ఎలక్ట్రానిక్స్ విభాగ ఆధ్వర్యంలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పీసీబీ) డిజైనింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ రంగంలో పీసీబీ పాత్ర ఎంతో ముఖ్యమైనదని, భవిష్యత్‌లో సాంకేతిక రంగంలో అనేక మార్పులు చోటు చేసుకోనున్నాయని, మార్పులకు తగినట్లుగా విద్యార్థులు కొత్త పద్ధతులను నేర్చుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్ విభాగ ఇన్‌చార్జి ఎస్.కిరణ్మయి మాట్లాడుతూ విద్యార్థినుల్లో ప్రత్యక్ష అవగాహన, ప్రాక్టికల్ నాలెడ్జ్ కల్పించేందుకు రెండు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్క్‌షాప్ కో–ఆర్డినేటర్ ఆర్. స్వాతి, అధ్యాపకులు కె.గోమతీదేవి, ఎం.కిరణ్‌కాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఉషారాణి

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక సమావేశం

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)కు అందే ఫిర్యాదుల పరిష్కారం, అందించే ఎండార్స్‌మెంట్‌లు విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, ఎండార్స్‌మెంట్‌లపై ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. తొలుత పీజీఆర్ఎస్‌కి ఇచ్చిన ఎండార్స్‌మెంట్స్‌ను పరిశీలించి, ఫిర్యాదుదారు ఇచ్చిన ఫిర్యాదును రీ ఓపెన్ చేసిన, సంతృప్తి చెందని వాటికి విభాగాధిపతే నేరుగా క్షేత్ర స్థాయి పరిశీలన చేసి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని ఎండార్స్‌మెంట్స్‌లో సమగ్రంగా వివరణ ఉండటం లేదని, విభాగాధిపతులు, క్షేత్ర స్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరిస్తే సమస్యల పరిష్కారం తేలిక అవుతుందన్నారు. ఈ–ఆఫీస్ ఫైల్ తప్పనిసరిగా విభాగ సూపరింటెండెంట్ ద్వారానే ఫార్వార్డ్ అవ్వాలని చెప్పారు. అదే విధంగా శనివారం స్కూల్‌ల్లో నిర్వహించనున్న పేరెంట్స్– టీచర్స్ మీటింగ్‌కు స్కూల్స్ వారీగా సీనియర్ అధికారులను ఇన్‌చార్జిలుగా విధులు కేటాయించాలని డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావుని ఆదేశించారు.



అధికారులతో సమావేశమైన కమిషనర్

మెరుగైన విద్యా వ్యవస్థ కోసం పోరాడాలి

లక్ష్మీపురం: ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బందెల నాసర్ జీని పలువురు అభినందించారు. స్థానిక గుంటూరు మల్లయ్య లింగం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. సభకు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండారపు యశ్వంత్ అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అభినందించారు.